


— ఎనుగంటి వేణుగోపాల్

# చెల్లియో... చెల్లకో

ఏ నోట విన్నా ఇదే విషయం...
ఎక్కడ చూసినా ఇదే చర్చ!!—
లేటెస్ట్‌గా దీనిగురించే తర్జన భర్జన.
అంతటా ఇదో తలనొప్పి వ్యవహారమై పోయి మెదళ్ళని బొప్పికట్టిస్తోంది.

చంటి పిల్లల నోట్లోనాని... పెద్దవాళ్ళ నాలుకల్లో ఉబ్బి పోతోందీవార్త...! కొళాయిల దగ్గర అమ్మలక్కల నుండి ఆఫీసు సిబ్బంది వరకూ... పల్లె పొలిమేరల నుండి నగర నడిబొడ్డు దాకా... చకా చకా పాకిపోయింది——

పాకి... పోలేదు గానీ తిష్ఠవేసుక్కూచుంది.

అసలిదంతా దేని గురించంటే...

★ ★ ★

పచ్చిమిర్చీ అంటిన నాలికలా అల్లల్లాడి పోతున్నాడు సారథి. చీమకుట్టిన వేలిలా చిమ చిమ లాడిపోతున్నాడు.

నిల్చున్న చోటునే వేదికగా మలచుకొని.. రెండడుగులు అటూ, రెండడుగులు ఇటూ వేస్తూ నాటకంలోని ఏకపాత్రలా తిరుగాడుతు న్నాడు.

చిద్విలాసంతో బస్టాండ్‌కి వొచ్చాడా?... ఇప్పుడేమో చిటపట మొహంతో చిందులేస్తు న్నాడు.

## (1)

పావు... అర... అలా అలా గంటయ్యింది. నిలబడి నిలబడి కాళ్ళు పీకుతున్నాయి.

బస్సు రాదు. విసుగుపోదు. గొణుక్కుంటూ పిచ్చి చూపుల్తో గస్తీ చేస్తున్నాడు.

అలాంటి సమయంలో—

“ఓ పైస దానం సేయండి బాబయ్యా! పున్నెముంటది...” రెండు అరచేతుల్ని దోసి లిగా మలుచుకొని ఆర్తిగా అడుగుతున్నాడో బిచ్చగాడు.

చింపిరి గడ్డం, మాసిన తల, భుజాన జోలె, చిరిగిన అస్తవ్యస్త వస్త్రధారణతో దీనంగా నిలబ డిఉన్నా...

ఆ అర్థింపుకి కించిత్ కరిగిపోలేదు సారథి. సరికదా—

“చిల్లర్లేదు. ఫో!” అంటూ కసురుకున్నాడు.

ఇది ఎన్నవసారో తెలీదతనికి, వ్యక్తులు మారుతున్నా గొంతుల్లోని అర్థింపులవే!

దోమలన్నా కాస్త టైమ్ తీసుకొని మరీ వొంటిని టచ్ చేస్తూ వెళ్తున్నాయోమోగానీ... వీళ్ళు... బిచ్చగాళ్ళు మాత్రం ఎవ్వరూ వొద లట్లేదు.

అసలే బస్సురాక సారథికి అసహనంగా ఉంది. పైగా ఈ బిచ్చగాడి రొదొకటి. చికాకు ప్రదర్శిస్తూ చప్పున మొహం తిప్పేసుకొని మరోవైపు తిరిగాడు.


పట్టువదలని ‘ఫెవికాల్’ లా వాడూ అటు జరిగి, “గట్లన కుంద్రి బాబయ్యా! దెర్మ పెబు వులు...” అంటూ జాలిగా మొహం పెట్టాడు.

వీడు డబ్బులు విదిల్చేదాకా వొదిలేసే రకం కాదని నిర్ధారించుకున్నాడు సారథి.

విసుక్కుంటూనే ప్యాంట్ వెనక జేబులోకి చేతిని పోనిచ్చాడు. కెలికి మరీ దొరికిన ఓ బిళ్ళని బయటకు తీసి, వాడి దోసిట్లో పడేలా కాస్త పైనుండి నెమ్మదిగా జారవిడిచాడు.

ఆ బిళ్ళని వేళ్ళ కొసల్తో పట్టుకొని, దాని వైపు పురుగుని చూసినట్టు ఎగాదిగా చూస్తూ —

“గిదేందయ్యా...! పైసేయుంద్రంటే గిదే సింద్రు...” అనడిగాడు మొహం చిట్లించి.



“నీ పెన్నుని శేఖర్ దొంగిలించాడనుకో అప్పుడు నువ్వేం చేస్తావు?” అని అడిగాడు మాష్టారు.

“వాడి పుస్తకాన్ని దొంగిలిస్తాను!” అన్నాడు వంశీ.

“అదేంట్రా...! తప్పుకదా...?” అని గద్దిం చారు మాష్టారు.

“మరి మీరే కదు సార్...” మోసాన్ని మోసం తోటే జయించాలని చెప్పారు!” అని చెప్పాడు ధీమాగా.

— చందూవంశీ
సంద్యాల.

సారథి వాడికేసి అదోలా చూస్తూ, “ఇరవై నోటు లేదు. అందుకని ఇరవై పైసల చిల్లరిచ్చా నన్నమాట...” కసిగా అన్నాడు పళ్ళు పట పట లాడిస్తూ.

‘దబాయించి అడుక్కోవడమే కాకుండా... డబ్బులు తక్కువయ్యాయంటూ నిలదీయడ మొకటి వీళ్ళ మొహాలకి’ తిట్టుకున్నాడతను.

“గట్లంట రేంది దొరా... ఉత్తినే పైసలేత్తున్న రేంటి...?!”

“మరి?!...” నోరెళ్ళబెడ్తూ అడిగాడు.

“...పున్నెం కొరకేత్తున్నరు...!!”

“వాడి మాట పూర్తి కాకుండానే—

“అడ్డడ్డే...! నాకు తెలీదే...? ఇంద. ఈ పది నోటు ఉంచేసుకో ... ఎంత పుణ్యమొస్తుందం టావ్!” అడిగాడు వెటకారంగా.

గట్లని గాదు బాంచను... గా నోట్లెవలడి గింద్రు... సిల్లరడిగినగని...!”

“మరి నేనిచ్చింది చిల్లర కాకపోతే మరేటి?!...” చిరాకు ప్రదర్శించాడు.

అవ్వెవలు దీస్కుంటున్నరు??... గా పైస లేద సెల్తున్నయ్యే దొరా!” టక్కున అన్నాడు.

## (2)

సారథి భృకటి ముడివడింది. ‘బావ్‌రే... వా!’ అనుకున్నాడు.

సస్పెన్స్ థ్రిల్లర్ చూస్తున్న ఫీలొంగొక టిస్తూ——

“ఏవిటీ... చిల్లర డబ్బులు చెల్లడం లేదా?!” అనడిగాడు.

“మీకు తెల్వేటీ?!... అయిదూ, పది, ఇరవై పైసలు సెల్తలేవు బాంచను.” అదివిని గతు క్కుమన్నాడు.

వాడి చేతిలోని బిళ్ళని చప్పున లాక్కొని జేబులో వేసుకొన్నాడు. ఇవ్వకపోతే తినేసేలా ఉన్నాడని. కెలికి జేబులోంచి ఓ అఠానా తీసి వాడి చేతిలో పెట్టేశాడు.

“దానం కొద్దీ పున్నెం...” అని గొణు క్కుంటూ వెళ్ళిపోయాడు వాడు.

★ ★ ★

ఫోజొకటి ఆలవోకగా విసుర్తూ సారథి ఎక్కా ల్సిన బస్సు తాపీగా వొచ్చి ఆగింది.

గభాల్న జనం మూగారు. పీచు మిఠా యిలా అటుజరిగి— ఇటు జరిగి— వొత్తబడి — నెట్టబడి —తిరగబడి —ఎట్టకేలకు సారథి బస్సెక్కేశాడు.

“టికెట్... టికెట్...” అని అరుస్తూ టిక్కెట్లు పంచుతున్నాడు కండక్టర్. అలా అలా సారథి దగ్గరికొచ్చేడు.

“ఎక్కడ కండీ!...” అనడిగేడు.

చెప్పేడు సారథి.

టికెట్ పంచ్ చేసి డబ్బులకోసం చేయిచా చాడు కండక్టర్.

చిల్లర డబ్బులు లెక్కెట్టి మరీ భద్రంగా కండక్టర్ చేతిలో పోశాడు... ఏదో పరిచయ మున్న వాడిని చూసి పలకరింపుగా నవ్వినట్టు —— నవ్వొకటి విసుర్తూ—.

స్వీకరింపబడలేదా చిర్నవ్వు.

పైగా, కండక్టర్ కొరకొరా చూస్తూ——

“ఇక్కడేముంది?!...” అనడిగేడు చూపు డువేలెట్టి తన చెవివేపు చూపిస్తూ.

“చెవిలో పెన్ను!” అన్నాడు పళ్ళికిలిస్తూ.

“ఆహా... పువ్వులేదూ!?” అనంటూ మింగేసేలా చూస్తూ చిల్లర తిరిగి సారథి చేతిలో పోశాడు.

“అదేంటి?!... డబ్బుల్లేకుండా టిక్కెట్లిస్తు న్నారా!...” అడిగాడబ్బురపడ్తూ.

చిల్లర షర్ట్ జేబులో పోసుకుంటూ, “ఆర్టీసీ మీదీ— మాదీ— మనందరిదీ! అంటే ఏవో అనుకున్నాను. నిజమే నన్నమాట.” అన్నాడు హాయిగా ఊపిరి పీల్చేస్తూ.

ఉరుమురిమి చూస్తున్నాడు కండక్టర్.

“నీ కంటికి చిల్లర గాడిలా కన్పిస్తున్నానా!? —చెల్లని నాణేలు తెచ్చి నాకంట గడ్తు న్నావ్!” సారథి మొహంలో మొహం పెట్టి చురచురా చూస్తూ అన్నాడు కండక్టర్.

గతుక్కుమన్నాడతను.

తిరిగి జేబులోంచి చిల్లర బయటకు తీసి వాటిని అటుతిప్పి ఇటు తిప్పి సూస్తూ—

“ఇవి చెల్లని వేం కాదు! నొక్కుపోలేదు.

బానే ఉన్నాయ్‌గా!" అన్నాడు ఫేస్‌ని క్వశ్చన్ మార్క్ చేస్తూ.

(3)

"అయ్యో! చ్చొచ్చొ... తెలీదే?!..." ఇప్పుడే రిజర్వ్ బ్యాంక్ ప్రెస్ నుండి తేలేదూ!? కబుర్లాపి నోటు... నోటు తీయండి..." అన్నాడు దబాయిస్తూ.

"అదేంటండీ! కండక్టర్లంతా చిల్లర... చిల్లరంటూ వెంపర్లాడ్తుంటారు. మీరు నోట్లంటున్నారేం?!... ఏం మీకు చిల్లర పడదా?" అడిగాడు పళ్ళికిలించి అదేదో జోకైనట్టు పడీ పడీ నవ్వేస్తూ.

"అవునవును పడదు... ఎలర్జీ!" అన్నాడు కండక్టర్ కుతకుతా ఉడికిపోతూ. సారథి చప్పున నవ్వాపి—

"మరి తగు చిల్లరతో బస్సెక్కాలి. అనెందుకు రాయించారూ...?" రాజకీయ నాయకుడిని ఇంటర్వ్యూ చేస్తోన్న విలేఖరిలా తన డౌటు ముందుంచాడు.

"చిల్లరతో బస్సెక్కాలని రాయించిన మాట వాస్తవమే కానీ... చెల్లని చిల్లరతో అని కాదుగా!" ఎలా చెప్పా? అన్నట్లుగా సమాధానం వచ్చింది కండక్టర్ నుండి.

జుత్తు పీక్కున్నాడు సారథి .

'పొద్దుట్నుండీ ఇతగాడి కెవరూ దొరకనట్టున్నారు. నన్ను తినేస్తున్నాడేందిరా బాబూ! ... అనుకొన్నాడు.

"ఇవి చెల్లని చిల్లర కాదండీ... తెల్లని చిల్లర..." అన్నాడు. చిల్లరని కండక్టర్ కళ్ళ దాకా తీస్కెళ్ళి చూపెడ్తూ— కండక్టర్‌కి సైటేమోనని డౌటొచ్చి.

"కానవిపుడు చెల్లడం లేదుగా!" అన్నాడు కండక్టర్ భూజాలెగరేస్తూ. . అప్పుడర్థమయ్యిందా మట్టి బుర్రకి. బిచ్చగాడన్నది స్ఫురణకొచ్చింది.

అరచేత్తో నుదురు కొట్టుకొంటూ చిల్లర లోపల పోసుకొని, నోటు తీసి కసిగా కండక్టర్ చేతిలో పెట్టాడు.

పళ్ళికిలిస్తూ కండక్టర్ టికెట్ సారథి చేతికిచ్చేడు.

★ ★ ★

"చిల్లరెందుకు చెల్లడం లేదబ్బా!..." మెదడు చించుకుంటున్నాడు సారథి .

బావురుమంటూ చిన్న క్యాష్ బ్యాగెడు చిల్లర ముందేసుక్కూచున్నాడు. ఆ నాణేలన్నీ తనని చూసి 'వ్వే... వ్వే..' అని వెక్కిరిస్తున్నట్లుగా అన్పిస్తోందతనికి.

"ఏవండీ! రోజూ సిటీబస్సుల్లో చిల్లరకిబ్బంది అవుతోందంటూ... జీతం రాగానే ఉన్న చిల్లర్లన్నీ పోగేసి పెట్టుకున్నారు. మీకైతే ఎప్పుడు ఆగమే!" అంటూ రుసరుసలాడ్తూ వంటింట్లోంచి వచ్చింది సారథి భార్య.

వేదాంతిగా నిర్వికారంగా చూశాడామె వేపు.

"చేసేది చేయించేదీ... అంతా ఆపైవాడే సుమా!" చేయెత్తి పైకప్పు కేసి చూపిస్తూ ఓ డైలాగ్ విసిరాడు.

"చాల్చాల్లెండి సంబడం." మూతి మూడు వంకర్లు తిప్పిందావిడ.

"వీధి చివరి కొట్టువాడికెంతో ఇవ్వాలన్నావుగా! ఇవి తగలబెట్టకపోయావా... పీడా విరగడై పోతుంది." అన్నాడో సలహా పారేస్తూ.

"ఆ పనీ చేశానండి. ఇందులోంచి చారానా, అఠానా బిళ్ళలేరుకొని... ఇవి నహీ చల్తా! అన్నాడండి." అంది.

'వాడికీ తెలిసిపోయిందీ!' అని ముక్కుమీద వేలేసుకుంటూ—

(4)

"ఇప్పుడెలా గంటావ్!" అనడిగేడు.

చిల్లరేమో చెల్లడం లేదు. చూస్తూ చూస్తూ అంతచిల్లర పడవేయ బుద్ధీ అవడం లేదతనికి. చిక్కుముడిలో చిక్కుకున్నవాడిలా విలవిల్లాడిపోతున్నాడతను.

"పక్కింటి పిన్నిగారు చెప్పారేంటండీ..."

"ఏమని?!... ఈ చిల్లరంతా కరిగించేసి గిన్నెదైనా చేయించుకొమ్మనా...?" వ్యంగ్యంగా అడిగేడు.

"ఛ.... ఛ... మీకెప్పుడూ వెటకారమే! ఫలానా సెంటర్లో— 'చిల్లర కొనబడును' అనే బోర్డొకటి పెట్టేసుకొని.. చిల్లరంతా తూకం చొప్పున కొనేస్తున్నారంట..." అందామె కన్రెప్పల్ని రెపరెపలాడేస్తూ.

అది విని 'ఆఁ...!' అంటూ కుర్చీలో అంతెత్తు లేచి ఎగిరి పడ్డాడు సారథి.

తేరుకొని, "అయితే ఇప్పుడే వెళ్ళి ఆపని చేసొస్తా!" అంటూ గబగబా తయారై పరుగు పరుగున భార్య చెప్పిన సెంటర్‌కి పరుగెత్తుకొని వెళ్ళాడు.

వెతగ్గా వెతగ్గా ఓ చిన్న మూలన కన్పించిందతనికా బోర్డ్—

"ఇక్కడ చిల్లర డబ్బులు తూకం చొప్పున కొనబడును!"— అని. సారథి కళ్ళు మిలమిలా మెరిసాయ్.

గబాల్న క్యాష్ బ్యాగ్‌తో లోపలికి చొరబడ్డాడు.

★ ★ ★

ఆ చెల్లని చిల్లర భారం దించేసుకొని... చిల్లర కొచ్చిన పది నోటునోమారు విషాదంగా చూసుకొని... కళ్ళు బైర్లు కమ్మబోతోంటే తమాయించుకొని... బయట పడ్డాడు సారథి .

★ ★ ★

ట్రిమ్‌గా తయారై... జేబునిండా నోట్లు పెట్టుకొని... ఒక్క చిల్లర పైసా లేనందుకు... గుండెల్నిండా ఊపిరి పీల్చేసుకుంటూ.... అలా వెళ్ళిపేపర్ చదూకుందామనుకుంటూ వెళ్తున్న వాడల్లా——

వీధి చివర మలుపులో ఓ మూల నుండి వినవస్తున్న మాటలు చెవిన బడి... టక్కున ఆగిపోయాడు సారథి.

ఇద్దరు బిచ్చగాళ్ళు ముచ్చటించుకుంటున్నారిలా——

"పెద్దోడా! నువ్ సేసిన పతకం ఇకటించింది. మనోళ్ళ రాబడి పెరిగిపోద్దని సిల్లర సెల్లలేదని పెచారం సేత్తిమా..."

"...ఏటైందేటి?!" మధ్యలోనే అడ్డుపడ్తూ ఆసక్తిగా అడిగేకా ముసలి బిచ్చగాడు.


"...సిల్లర నాణేలు సెల్తున్నయంటూ గియ్యాల పేపర్ల పెబుత్వం పెకటించిందంట! సిల్లర మల్ల సెలామనీ అయితదింకేంది? మల్ల మనకిగా అయిదూ —పది పైసలే దిక్కు..." అంటూ వాపోతున్నాడు రెండేడు.

అది విని నోరెళ్ళబెట్టాడు సారథి .

"అమ్మ నా బిచ్చగాళ్ళారా... ఇదంతా మీ సంఘపు వాళ్ళపనా! ఓర్నాయనో..." లబలబలాడ్తూ ముందుకి సాగాడతను.

(చిల్లర నాణేలు చెల్లడం లేదంటూ... ఎలా బయల్దేరిందో తెలీదు గానీ, ఈ మధ్యనే చిన్న పుకారు రాష్ట్రవ్యాప్తంగా వ్యాపించిన నేపథ్యమే ఈ కథకి ఊపిరి —రచయిత)

★



మన పూర్వీకులందరూ రేడియోలూ, టీవీలూ, ఫ్రిజ్‌లూ లేకుండా ఎలా బతికేవారో అర్థం కావటం లేదు" అంది నిర్మల.

"అందుకేగా వాళ్ళందరూ పాపం చచ్చిపోయారు" వెంటనే చెప్పింది శైలజ.